# 8 నెలల్లో 1,086 అవయవాలు దానం



**ఆర్కేనగర్, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో అవయవ దానం చేసే వారి సంఖ్య పెరిగింది. 8 నెలల్లోనే 1,086 అవయవాలు ప్రభుత్వానికి దానంగా అందాయి. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో 2008లో కలైజ్ఞర్ కరుణానిధి జీవన్మృతి చెందినవారి నుంచి అవయవదానం పొందేందుకు ప్రత్యేక పథకాన్ని ప్రారంభించారు. ప్రజల్లో మరింత అవగాహన ఏర్పరిచేలా అవయవదాతలకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి స్టాలిన్ గత సెప్టెంబరులో ప్రకటించారు.

## సీఎం ప్రకటన అనంతరం..

ముఖ్యమంత్రి ప్రకటన అనంతరం గత 8నెలల్లో ఇప్పటివరకు 192 మంది అవయవాలు దానంగా అందించారు. వారి నుంచి కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, గుండె, కార్నియా వంటి 1,086 అవయవాలు పొందారు. ఇది గత ఆరేళ్లతో పోల్చితే రికార్డుగానే చెప్పొచ్చు. ఈ సంవత్సరం ఇప్పటివరకు అవయవదానానికి 6,775 మంది సమ్మతి తెలిపారు.

## జీవన్మృతులు 2 వేల మంది..

ఆరోగ్యశాఖ మంత్రి మా.సుబ్రమణియన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 16 ఏళ్ల నుంచి జీవన్మృతి చెందిన 2వేల మంది నుంచి 11,411 అవయవాలు దానంగా పొందామన్నారు. గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు తదితర 7,207 ముఖ్య అవయవాలు పలువురి ప్రాణాలను నిలబెట్టాయి. 4,204 కణజాలాల మార్పిడి జరిగింది. అవయవదానంలో 8ఏళ్లుగా రాష్ట్రం ముందంజులో ఉంది. ఇప్పటివరకు 272 మంది దాతలకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. సీఎం ప్రకటన తర్వాత గతేడాదిలోనే 14,300 మంది అవయవదానం చేసేందుకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. దేశంలోనే మరెక్కడా లేనివిధంగా రాష్ట్రంలో అవయవమార్పిడి చికిత్సకు ముఖ్యమంత్రి బీమా పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ పథకం ద్వారా కాలేయం మార్పిడి శస్త్రచికిత్సకు రూ. 22 లక్షల వరకు, మూత్రపిండాలకు రూ. 4లక్షల వరకు, గుండెకు రూ. 18లక్షల వరకు అందజేస్తారు. గుండె, కాలేయం, మూత్రపిండాల కోసం 7,797 మంది వేచి చూస్తున్నారని వివరించారు.

ఏడాది దాతలు

| 2023 | 2022 | 2021 | 2020 | 2019 |
|---|---|---|---|---|
| 178 | 156 | 60 | 55 | 127 |

# విజయకాంత్ పాటలకు రాయల్టీ కోరను: ప్రేమలత



మాట్లాడుతున్న ప్రేమలత

**చెన్నై, న్యూస్‌టుడే:** నటుడు, డీఎండీకే వ్యవస్థాపకుడు విజయకాంత్ తమిళుల ఆస్తి అని, సినిమాల్లో ఆయన పాటలు, పోస్టర్లు ఉపయోగిస్తే రాయల్టీ కోరనని పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత తెలిపారు. హరీశ్ కల్యాణ్, అట్టకత్తి దినేశ్ ప్రధానపాత్రలు పోషించి గతవారం విడుదలైన 'లబ్బర్ పందు'లో విజయకాంత్‌కు చెందిన 'పొట్టు వచ్చ తంగకుడం' పాట ఉపయోగించారు. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రేమలతను కలిసింది. ఆమె మాట్లాడుతూ.. 'లబ్బర్ పందు'ని విజయకాంత్‌కు అంకితం చేస్తున్నట్లు దర్శకుడు, చిత్రబృందం వెల్లడించిందన్నారు. వారి కోరిక మేరకు కుటుంబ సమేతంగా సినిమా చూశామని, బాగుందని ప్రశంసించారు. ప్రతి సన్నివేశం, పాటలో విజయకాంత్ ప్రభావం కనిపించిందని పేర్కొన్నారు.



వేదికపై ముఖ్యమంత్రి స్టాలిన్, కూటమి పార్టీల నేతలు



తరలివచ్చిన కార్యకర్తలు

# డీ..ఎం..కే.. మన ఊపిరి

- ముఖ్యమంత్రి స్టాలిన్
- అట్టహాసంగా పార్టీ వజ్రోత్సవం
- భారీగా తరలివచ్చిన శ్రేణులు



ప్రసంగిస్తున్న స్టాలిన్

**ప్యారిస్, న్యూస్‌టుడే:** ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా భాజపా వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి స్టాలిన్ విమర్శించారు. ఒకే దేశం.. ఒకే ఎన్నిక వీలవదన్నారు. పార్లమెంటు ఎన్నికలు కూడా ఒకే విడతలో సాధ్యం కావడంలేదని, ఈ నేపథ్యంలో జమిలి ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. రాష్ట్రాలను కేంద్రపాలిత ప్రాంతాలుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రస్తుతం కేంద్రంలో మెజారిటీ లేని భాజపా ప్రభుత్వం ఉందని తెలిపారు. డీఎంకే ఏర్పాటై 75 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో పార్టీ వజ్రోత్సవం శనివారం సాయంత్రం అట్టహాసంగా జరిగింది. కూటమి పార్టీ నేతలు, డీఎంకే శ్రేణులు భారీగా తరలివచ్చారు. కాంచీపురం పచ్చయప్పన్ బాయ్స్ కళాశాల ప్రాంగణంలో జరిగిన వేడుకలకు పార్టీ ప్రధాన కార్యదర్శి, మంత్రి దురైమురుగన్ అధ్యక్షత వహించారు. స్టాలిన్ మాట్లాడుతూ పేరరిజ్ఞర్ అన్నా మార్గంలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని తెలిపారు. పేరరిజ్ఞర్ అన్నా, ముత్తమిళర్ కలైజ్ఞర్ మార్గంలో ద్రావిడ మోడల్ ప్రభుత్వాన్ని కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్వయంప్రతిపత్తిని తిరిగి పొందేందుకు పోరాడతామని తెలిపారు. సిద్ధాంతాల కూటమిని డీఎంకే ఏర్పాటు చేసిందని, అది అన్ని ఎన్నికల్లో విజయం సాధిస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. డీఎంకే అనే మూడు అక్షరాలు మన ఊపిరి, మాటలు, భావం అని అన్నారు. ఒకే సిద్ధాంతం ఉన్న మిత్రపార్టీలు ఉన్న పార్టీ డీఎంకే అని తెలిపారు. కూటమి పార్టీల ఐక్యతను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని చెప్పారు.

## అందరినీ కలుపుకెళుతూ..

అందరినీ కలుపుకెళ్లే పార్టీ డీఎంకే అని **సీపీఎం రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణన్** తెలిపారు. ఇండియా కూటమి ఏర్పాటుకు స్టాలిన్ కారణమని చెప్పారు. దేశంలోని రాజకీయ మలుపులకు డీఎంకే భాగస్వామ్యం అత్యంత ముఖ్యమైనది తెలిపారు. జాలర్ల సమస్యలపై ప్రధానిని కలిసి చర్యలు చేపట్టాలని స్టాలిన్ కోరారని గుర్తు చేశారు. కేంద్రంలో మెజారిటీ లేని భాజపా ప్రభుత్వం ఉందని, ఆ పాలనకు ముగింపు రావాలన్నారు.

## భాషల నాశనానికి భాజపా యత్నం..



డీఎంకేను నాశనం చేయడానికి కొన్ని సనాతన శక్తులు ప్రయత్నిస్తున్నాయని **ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో** ఆరోపించారు. దేశానికే తమిళనాడు మార్గనిర్దేశం చేస్తోందని తెలిపారు. ఇండియా పేరును భారత్‌గా మార్చడానికి భాజపా యత్నించిందన్నారు. దేశంలోని పలు భాషలను నాశనం చేయడానికి భాజపా ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు.

## అన్ని పార్టీలకు దిశానిర్దేశం..



వజ్రోత్సవం జరుపుకొంటున్న డీఎంకే దేశంలో అన్ని పార్టీలకు మార్గనిర్దేశం చేస్తోందని **వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్** తెలిపారు. 75 ఏళ్లుగా విజయ పరంపర సాగిస్తోందన్నారు. దేశానికే మార్గదర్శకమైన పథకాలను కలైజ్ఞర్ కరుణానిధి పరిచయం చేశారని తెలిపారు. తంథై పెరియార్ సిద్ధాంతాలను పాటిస్తూ డీఎంకే పని చేస్తోందని చెప్పారు. త్రిభాషా విధానం అంగీకరించమని తెలిపి ద్విభాషా విధానంలో దృఢంగా ఉందన్నారు. హిందీని రుద్దడానికి వ్యతిరేకంగా పోరాటం డీఎంకే చేపట్టిందనానరు. డీఎంకే అధ్యక్షుడిగా స్టాలిన్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి విజయాలు అందుకుంటున్నారని పేర్కొన్నారు. దేశంలోనే కేంద్ర ప్రభుత్వాన్ని సవాలు చేసే పార్టీ డీఎంకే అన్నారు. అన్ని కులాలవారు అర్చకులు కావచ్చని డీఎంకే చేసి చూపిందన్నారు. సిద్ధాంతాల ప్రాతిపదికన కూటమి పార్టీలు పని చేస్తున్నాయని తెలిపారు. వీసీకే ఎప్పటికీ మూడో జట్టుగా డీఎంకేతో ఉంటుందని తెలిపారు.

## హక్కుల కోసం పోరాటం..



ప్రధాని మోదీని కలిసిన తర్వాత తమ సిద్ధాంతాల్లో స్థిరంగా ఉన్నట్లు దిల్లీలో ముఖ్యమంత్రి స్టాలిన్ ధైర్యంగా చెప్పారని **సీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు ముత్తరసన్** తెలిపారు. డీఎంకే ప్రారంభించిన 15 ఏళ్లలో అధికారంలోకి వచ్చిందన్నారు. తమిళనాడు హక్కుల కోసం ముఖ్యమంత్రి స్టాలిన్ పోరాడుతూనే ఉన్నారని ద్రావిడ కళగం అధ్యక్షుడు కె.వీరమణి తెలిపారు.

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ అధ్యక్షుడు ఖాదర్‌మొయిద్దీన్, మక్కల్ నీది మయ్యం అధ్యక్షుడు కమల్‌హాసన్ తదితర కూటమి పార్టీనేతలు పాల్గొన్నారు. బెయిల్‌పై బయటికొచ్చిన మాజీ మంత్రి సెంథిల్ బాలాజీతోపాటు డీఎంకే మంత్రులు ఉదయనిధి స్టాలిన్, కేఎన్ నెహ్రూ, ఎంపీలు, పార్టీ నిర్వాహకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



ఆలయం ఎదుట కుటుంబసభ్యులతో మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.ఆర్.శ్రీరామ్ ● జస్టిస్ ఎన్.సెంథిల్ కుమార్

# శ్రీవారిని దర్శించుకున్న మద్రాస్ హైకోర్టు సీజే

**తిరుమల, న్యూస్‌టుడే:** శ్రీవారిని మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.ఆర్. శ్రీరామ్, న్యాయమూర్తి జస్టిస్ ఎన్.సెంథిల్‌కుమార్ శనివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న సీజే, న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

# తిరుపతి లడ్డూ.. 'నో కామెంట్స్': రజనీకాంత్

**చెన్నై, న్యూస్‌టుడే:** తిరుపతి లడ్డూ వ్యవహారంపై స్పందించడానికి నటుడు రజనీకాంత్ నిరాకరించారు. చెన్నై విమానాశ్రయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... 'వేట్టైయన్' చిత్రం అందరి ఆకాంక్షలు నెరవేర్చుతుందనే నమ్మకం ఉందన్నారు. ఎక్కువ థియేటర్లలో విడుదల కానుండటం సంతోషంగా ఉందని తెలిపారు. తిరుపతి లడ్డూ వ్యవహారంపై విలేకర్లు లేవనెత్తిన ప్రశ్నకు 'నో కామెంట్స్' అన్నారు.

# మరిన్ని పెట్టుబడులు పెట్టాలి: స్టాలిన్



టాటా గ్రూపు ఛైర్మన్ చంద్రశేఖరన్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి స్టాలిన్

**చెన్నై, అరక్కోణం, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో టాటా గ్రూపు మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఛైర్మన్ చంద్రశేఖరన్‌ను కోరినట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. ఆయన తన 'ఎక్స్' పేజీలో... రాణిపేట జిల్లా సిప్కాట్‌లోని టాటా మోటార్స్ సంస్థ కొత్త యూనిట్ శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా చంద్రశేఖర్‌ను కలిసే అవకాశం లభించిందన్నారు. నిరాడంబర నేపథ్యంతో ఎదిగిన ఆయన భారత కార్పొరేట్ ప్రపంచ గౌరవనీయ నాయకుల్లో ఒకరిగా ఎదగడం పలువురికి ప్రేరణగా ఉందని తెలిపారు. భేటీ సందర్భంగా రాష్ట్రంలో టాటా గ్రూపు మరిన్ని పెట్టుబడులు వెచ్చించాలని కోరినట్లు పేర్కొన్నారు. మూడేళ్లలో టాటా గ్రూపు ప్రాజెక్టులను రాష్ట్రంలో విస్తరించడాన్ని ఆయన గుర్తు చేశారని, డీఎంకే ప్రభుత్వ పనితీరును అభినందించారని తెలిపారు. రాష్ట్ర యువతకు అవసరమైన ఉద్యోగావకాశాలను రూపొందించడానికి కలిసి పయనిద్దామంటూ భరోసా ఇచ్చానని పేర్కొన్నారు.

■ శంకుస్థాపన సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ.. టాటా మోటార్స్ రాష్ట్రానికి రావడం గొప్ప విషయమన్నారు. ఈ సంస్థకు అనుబంధంగా 15 కంపెనీలు కూడా ప్రారంభమవుతాయని చెప్పారు. రాష్ట్రంలో 1973న అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి సిప్కాట్ ఏర్పాటు చేసి పరిశ్రమల స్థాపనకు శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో మంత్రులు దురై మురుగన్, ఆర్.గాంధీ, అరక్కోణం ఎంపీ జగద్రక్షగన్, టాటా గ్రూపు ఛైర్మన్ చంద్రశేఖరన్, ఇతర నిర్వాహకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# శ్మశానవాటికలు ప్రవేటుపరమా?

## కార్పొరేషన్ తీర్మానాన్ని ఖండించిన ఈపీఎస్

**సైదాపేట, న్యూస్‌టుడే:** శ్మశానవాటికలను ప్రైవేటుపరం చేయడం దారుమణి మాజీ ముఖ్యమంత్రి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి తెలిపారు. శనివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. 27న కార్పొరేషన్ సమావేశంలో ఆమోదించిన కొన్ని తీర్మానాలు ప్రజలకు ఇబ్బంది కలిగిస్తాయన్నారు. అంత్యక్రియలను సేవగా భావించి ప్రభుత్వ శ్మశానవాటికలు పని చేస్తున్నాయని గుర్తు చేశారు. వాటిని వ్యాపారదృష్టితో ప్రైవేటుపరం చేస్తే పేద, మధ్యతరగతి ప్రజలకు అవస్థలు తప్పవన్నారు. డీఎంకే ప్రభుత్వంలో ఇప్పటికే విద్యుత్ ఛార్జీల పెంపు, ఆస్తిపన్ను పెంపుతో జనంపై భారం మోపారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేషన్ ఇకపై ఏటా 6 శాతం ఆస్తి పన్ను పెంపు సరికాదన్నారు. తీర్మానాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

**9న నిరాహార దీక్ష..** డీఎంకే ఎన్నికల హామీలు నెరవేర్చాలని, అన్నాడీఎంకే హయాంలో ప్రవేశపెట్టిన తాళికి తంగం(తాళికి బంగారం) తదితర పథకాలు మళ్లీ అమలు చేయాలని మరో ప్రకటనలో ఈపీఎస్ డిమాండ్ చేశారు. ఇదే విషయమై పార్టీ తరఫున అక్టోబర్ 9న మదురైలో నిరాహారదీక్ష చేపట్టనున్నట్లు ప్రకటించారు.

# ఆరోగ్య సిబ్బందిని పర్మినెంట్ చేయాలి: హైకోర్టు

**ప్యారిస్, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో మూడేళ్లకు పైగా విధులు నిర్వహించిన ఆరోగ్య సిబ్బందిని పర్మినెంట్ చేయాలని మద్రాసు హైకోర్టు తెలిపింది. పలు మున్సిపాలిటీలను కార్పొరేషన్లుగా ఉన్నతీకరించారు. కార్పొరేషన్ సరిహద్దులను కూడా విస్తరించారు. చెన్నై, తూత్తుక్కుడి, కరూర్, నామక్కల్ తదితర కార్పొరేషన్లతో కలిసిన పంచాయతీలు, మున్సిపాలిటీల్లో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది శీను, ప్రభాకరన్ తదితర 81 మంది తమను పర్మినెంట్ చేయాలని హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ జస్టిస్ ఇళంతిరైయన్ ఎదుట విచారణకు వచ్చింది. పిటిషనర్లు తరఫున హాజరైన లాయరు.. .తూత్తుక్కుడి, నామక్కల్ తదితర కార్పొరేషన్లలో అనుసంధానించిన తాత్కాలిక ఆరోగ్య సిబ్బంది మూడేళ్లు విధులు నిర్వహిస్తే పర్మినెంట్ చేయడానికి అర్హులని హైకోర్టు 2015లో ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఇదే తీర్పును 2017లో సుప్రీంకోర్టు సమర్థించిందన్నారు. అనంతరం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 2019లో జీవో జారీచేసి సుమారు 275 మందిని పర్మినెంట్ చేశారన్నారు. ఆ జీవో ప్రకారం పిటిషనర్లను పర్మినెంట్ చేయాలని వాదించారు. కార్పొరేషన్ తరపున.. పర్మినెంట్ చేసే విషయమై హైకోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకంగా ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిందని, ఆ ఉత్తర్వులను పునఃపరిశీలించాలని ప్రభుత్వం మళ్లీ పిటిషన్ దాఖలు చేయగా పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేసినా హైకోర్టు డివిజన్ బెంచ్ ఉత్తర్వులకు సుప్రీంకోర్టు నిషేధం విధించలేదని, వారిని పర్మినెంట్ చేయాలని న్యాయమూర్తి ఉత్తర్వులు ఇచ్చారు.

# ప్లాస్టిక్ వ్యర్థాలు తింటున్న ఏనుగులు



**కోయంబత్తూరు, న్యూస్‌టుడే:** కోవై మరుదమలై శివారు సోమైయంపాలయం పంచాయతీ పరిధిలోని డంపింగ్ కేంద్రాల్లో అడవి ఏనుగులు ప్లాస్టిక్ వ్యర్థాలను ఆరగించడం పలువుర్ని దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ఈ డంపింగ్ కేంద్రంలో అయిదుకుపైగా గ్రామాల నుంచి చెత్తాచెదారం తెచ్చి పడేస్తున్నారు. అడవి ఏనుగులు ఇక్కడికొచ్చి ప్లాస్టిక్ వ్యర్థాలు తింటున్నట్లు పలువురు గమనించారు. వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. వ్యాధుల బారిన పడి ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ, పంచాయతీ నిర్వాహకులకు పలుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి.

# రోడ్లపై గుంతల తవ్వకానికి జీసీసీ ఆంక్షలు

**చెన్నై:** మహానగర చెన్నై కార్పొరేషన్ ప్రాంతాల్లో రానున్న 30వ తేదీ నుంచి తదుపరి ఉత్తర్వులు జారీచేసే వరకు సేవావిభాగాల ద్వారా చేపట్టే రోడ్లపై గుంతలు తవ్వే పనులను నిలిపివేయాలని జీసీసీ కమిషనర్ కుమరగురుభరన్ తెలిపారు. ఈ విషయమై ఇప్పటికే సంబంధిత సేవా విభాగాలకు లేఖలు పంపినట్లు జీసీసీ ప్రకటనలో పేర్కొంది. ఆంక్షలు అమల్లో ఉన్న సమయంలో అత్యవసరాలకు మాత్రం డిప్యూటీ కమిషనర్(వర్క్స్), ప్రాంతీయ డిప్యూటీ కమిషనర్లు ద్వారా కమిషనర్ ఆమోదం పొందాల్సి ఉందని తెలిపింది.

# తవ్వకాల నిర్ణయం ఉపసంహరించుకోవాలి: అన్బుమణి

**సైదాపేట, న్యూస్‌టుడే:** కన్నియాకుమరి జిల్లా కిల్లియూరులో రేడియో ధార్మిక పదార్థాల తవ్వకాలు నిర్ణయాన్ని కేంద్రప్రభుత్వం విరమించుకోవాలని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. మణవాలకురిచ్చిలో కేంద్రప్రభుత్వానికి చెందిన ఇండియన్ ఇసుక మిల్లు ఉంది. దానికి ముడి పదార్థాలు అందించే ఉద్దేశంతో కిల్లియూరు ప్రాంతంలో తవ్వకాలు జరపాలని నిర్ణయించిందన్నారు. కిల్లియూరు, కీళ్‌మిటాలం, మిటాలం, ఇనైయం, బుద్ధన్‌తురై, ఏళుదేశం తదితర గ్రామాల పరిధిలో 1,144 ఎకరాల విస్తీర్ణంలో తవ్వనున్నట్లు తెలిసిందన్నారు. మొత్తం 59.88 మిలియన్ టన్నుల మోనోసైట్ తదితర రేడియో ధార్మిక పదార్థాలు తీసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. తద్వారా 40 ఏళ్లు మిల్లు నడపొచ్చని పేర్కొన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా అనుమతిచ్చిందన్నారు. ఈ తవ్వకాలతో అక్కడి ప్రజలు క్యాన్సర్ తదితర ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తదితరులు

## టెలికాం ఉత్పత్తుల కేంద్రం ప్రారంభం

**వడపళని, న్యూస్‌టుడే:** కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూరులోని సందవెల్లూరు సి.గ్రామంలోని సిప్కాట్ పారిశ్రామికవాడలో సిస్కో టెలికాం ఉత్పత్తుల కేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని శుక్రవారం కేంద్ర సమాచారశాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే ఇది మొదటి ఉత్పత్తి కేంద్రం అని అన్నారు. ఉత్పత్తుల ద్వారా సిస్కో సంస్థకు 1.3 బిలియన్ల యూఎస్ డాలర్ల ఆదాయం సమకూరుతుందన్నారు. 'ఫ్లెక్స్' సంస్థతో కలిసి సిస్కో ఏర్పాటు చేసిన కొత్త యూనిట్‌లో రాష్ట్రంలో 1,200 మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని చెప్పారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా గ్లోబల్ టెక్నాలజీకి అనుగుణంగా సిస్కో ఉత్పత్తులుంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీఆర్బీ రాజా, సిస్కో సంస్థ సీఈవో, ఛైర్ చక్ రాబిన్సన్, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ జీటు పటేల్, అధ్యక్షుడు డేవ్ వెస్ట్, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# సాయిల్ నెయిల్ ప్రాజెక్ట్ విజయవంతం

### నీలగిరిలో మట్టి చరియలు విరిగిపడకుండా నియంత్రణ

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** ప్రముఖ పర్యాటక కేంద్రమైన నీలగిరి జిల్లాకు ఏటా లక్షలాది మంది పర్యాటకులు వస్తుంటారు. నీలగిరి జిల్లా సముద్ర మట్టానికి సుమారు 6,600 అడుగుల ఎత్తులో ఉంది. అదే సమయంలో కొండ చరియలు విరిగిపడే ప్రమాదాలు కూడా అధికం. దీంతో మేట్టుపాలయం-కోత్తగిరి మార్గంలో ఊటీకి వెళ్లే రోడ్డుపై కొండచరియలు విరిగిపడకుండా 'జియో గ్రిడ్' పద్ధతిలో నేలలో స్థిరత్వం పెంచేందుకు హైవేస్ విభాగం 'సాయిల్ నెయిలింగ్' అనే కొత్త సాంకేతికతను అందుబాటులోకి తెచ్చింది. అదేవిధంగా కొండ చరియలు విరిగిపడకుండా ప్రస్తుతం ఉపయోగిస్తున్న పద్ధతులతో పోల్చితే సాయిల్ నెయిలింగ్ విధానంతో ఖర్చు సగానికి తగ్గడంతోపాటు నిర్వహణ అనుకూలంగా ఉంటుంది. భారీ వర్షాలకు మట్టి యాంకర్లు వేసిన ప్రాంతాలలో ఎలాంటి నష్టం వాటిల్లకపోవడంతో ప్రాజెక్టు విజయవంతమైనట్లు తెలుస్తోంది. జిల్లాలో కొండ చరియలు విరిగిపడే ప్రాంతాలు, రోడ్డు ప్రాంతాలను గుర్తించి పాజెక్ట్‌ను విస్తరించనున్నట్లు జిల్లా రహదారుల విభాగ డివిజినల్ ఇంజినీరు కుళందైరాజ్ తెలిపారు.



సాయిల్ నెయిల్ ప్రాజెక్ట్ కింద చేపట్టిన పనులు

### ప్రాజెక్టు పనితీరు ఇలా..

సాధారణంగా మట్టి చరియలు విరిగిపడకుండా కాంక్రీట్ ప్రహరీలు నిర్మిస్తున్నందున చెట్లు పెరగలేని పరిస్థితి నెలకొంటోంది. ఇందుకు ప్రత్యామ్నాయంగా 'జియో గ్రిడ్' అనే పాలిమర్ వస్తువుతో తయారు చేసిన త్రీ డైమెన్షన్ ఇనుప కమ్మీల ద్వారా బలోపేతం చేసిన చాపలను ఉపయోగిస్తున్నారు. చాపల పైభాగంలో గడ్డి విత్తనాలు నాటి జియో గ్రిడ్‌లతో అనుసంధానిస్తున్నారు. నిటారుగా ఉన్న కొండల దిగువన మట్టి జారకుండా జియో గ్రిడ్ ద్వారా మట్టి దృఢత్వాన్ని పెంచి హైడ్రో సీటింగ్ పద్ధతిలో గడ్డిని పెంచుతారు. ముందుగా 70 డిగ్రీలకు మించని మట్టి వాలు కోణాన్ని తొలగించి సమం చేస్తారు. అప్పుడు నేల ఉపరితలంపై మట్టి జారకుండా పటిష్ఠమైన ఉక్కు కడ్డీలు దోహదం చేస్తాయి. నీలగిరి, వాల్పారై, కొల్లిమలై, ఏర్కాడు తదితర కొండ ప్రాంతాలలో ఈ విధానం అవలంబిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ అటవీ ప్రాంతం సమీపంలోని పర్వత మార్గం వెంట వన్యప్రాణుల వలసలను సులభతరం చేసింది. అలాగే మొక్కలతోపాటు అరుదైన జాతుల చెట్లు పెరగడానికి అనుకూలంగా ఉంది.

## పూండి చెరువుకు పెరిగిన నీటిరాక



జీరో పాయింట్‌కు చేరుకుంటున్న నీరు

**ఊత్తుకోట, న్యూస్‌టుడే:** చెన్నై నగర తాగునీటి అవసరాలు తీర్చే ప్రధాన చెరువుల్లో ఒకటైన పూండి చెరువులో నీటిమట్టం గణనీయంగా తగ్గింది. దీంతో తెలుగుగంగ పథకం కింద కండలేరు జలాశయం నుంచి ఈనెల 19న నీటిని విడుదల చేయగా 22వ తేదీ పూండి చెరువుకు చేరుకుంది. తొలుత వంద క్యూసెక్‌ల వంతున రాగా శనివారం నీటిరాక ఊత్తుకోట సమీప జీరోపాయింట్‌కు 320 క్యూసెక్‌లు, పూండి చెరువుకు 290 క్యూసెక్‌లకు పెరిగింది. చెరువులో 142 మిలియన్ క్యూసెక్‌ల నీరు నిల్వ ఉంది.

## వంద యూనిట్ల ఉచిత పథకం రద్దు కాలేదు

### టాన్‌జెడ్కో స్పష్టం

**వడపళని, న్యూస్‌టుడే:** గృహ వినియోగదారులకు అందిస్తున్న వంద యూనిట్ల ఉచిత పథకం రద్దు చేసే ఆలోచన లేదని టాన్‌జెడ్కో శుక్రవారం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. సామాజిక మాధ్యమాల్లో వంద యూనిట్ల ఉచిత విద్యుత్తు పథకం రద్దవుతున్నట్లు వస్తున్న వార్తలను కొట్టిపారేసింది. టాన్‌జెడ్కో అధికారిక వెబ్‌సైట్‌లో కచ్చితమైన సమాచారాన్ని తెలుసుకోవచ్చని చెప్పింది. ఎప్పటిలాగానే వంద యూనిట్ల ఉచిత పథకం కొనసాగుతుందని వివరించింది.



శిబిరాన్ని పరిశీలిస్తున్న శాంతకుమారి

## జీసీసీ ఆధ్వర్యంలో రేబిస్ వ్యాక్సిన్ శిబిరం

**చెన్నై, న్యూస్‌టుడే:** ప్రపంచ రేబిస్ దినోత్సవం పురస్కరించుకుని మహానగర చెన్నై కార్పొరేషన్ ప్రాంతాల్లో కుక్కలు పట్టే, పశువైద్య సిబ్బందికి రేబిస్ వ్యాక్సిన్ వేశారు. రిప్పన్ బిల్డింగ్‌లో శనివారం జరిగిన శిబిరాన్ని స్థాయీ సంఘం అధ్యక్షురాలు డాక్టర్ శాంతకుమారి పరిశీలించారు. శిబిరంలో పశు సహాయ వైద్యులు, 215 మంది సిబ్బందికి వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో భాగంగా వీధి కుక్కలు పట్టే సిబ్బందికి మూడు జతల ఏకరూప దుస్తులు, పాదరక్షలు, కుక్కలు పట్టేందుకు 79 బలార్స్ వలలు అందించారు. ప్రస్తుతం అందించిన వలల ద్వారా హాని జరగని విధంగా వీధి కుక్కలను పట్టుకోవాలని, కుటుంబ నియంత్రణ తర్వాత వాటికి వ్యాక్సిన్లు వేసి పట్టుకున్న ప్రాంతంలోనే విడిచిపెట్టాలని డాక్టర్ శాంతకుమారి సూచించారు. కార్యక్రమంలో నగర సంక్షేమ అధికారి డాక్టర్ జగదీశన్, నగర వైద్యాధికారి డాక్టర్ ఎస్.భానుమతి, పశు వైద్యాధికారి కమాల్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఏసీజీ' ఏడీజీగా డానీ మైఖేల్

**వడపళని, న్యూస్‌టుడే:** కోస్ట్ గార్డ్ రీజినల్ కమాండర్ ఈస్ట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ డానీ మైఖేల్‌కు అడిషనల్ డైరెక్టర్ జనరల్‌గా కేంద్ర ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఈ పదవిలో ఆయన ఆదివారం నుంచి సేవలందించనున్నారు. పదోన్నతిపై ఈస్టర్న్ సీబోర్డ్ విశాఖపట్నంలో బాధ్యతలు స్వీకరిస్తారని రక్షణ విభాగం శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈస్ట్ రీజియన్ కమాండర్‌గా 2023 నవంబరులో ఈయన బాధ్యతలు స్వీకరించారు. ఏడాది కాలంలో చెన్నై, ట్యుటికోరిన్‌లో సంభవించిన వరదలు, డిసెంబరులో ఎన్నూరులో సముద్రపు నీటిలో నూనె కలిసినప్పుడు తమిళనాడు కాలుష్య నియంత్రణ మండలితో కలిసి చేపట్టిన చర్యలు, మత్స్యదార్ల రవాణా మూలాను పట్టుకోవడంలో ఆయన చేసిన సేవలను గుర్తించి పదోన్నతి కల్పించినట్లు పేర్కొంది. చెన్నై ఐఐటీలో డిగ్రీ చదివిన తర్వాత 1990 జులై 6న ఏసీజీలో డానీ మైఖేల్ విధుల్లో చేరి దేశంలోని పలు ప్రాంతాల్లో పని చేశారు.



జైలు నుంచి విడుదలైన మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ శుక్రవారం రాత్రి ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన దృశ్యం - చెన్నై, న్యూస్‌టుడే

## పాపమ్మాళ్ మృతికి ముఖ్యమంత్రి సంతాపం

**చెన్నై, న్యూస్‌టుడే:** డీఎంకేకు చెందిన పాపమ్మాళ్(108) మృతికి పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ సంతాపం తెలిపారు. తన 'ఎక్స్' పేజీలో.. 17న జరిగిన పార్టీ ముప్పెరుం విళాలో 'పెరియార్' పురస్కారాన్ని అందుకున్న పాపమ్మాళ్ మరణించడంతో వార్త ఆవేదనకు గురిచేసిందన్నారు. డీఎంకే ఆవిర్భావం నుంచి పార్టీ కోసం సేవలందించారని తెలిపారు. 1965లో జరిగిన హిందీ వ్యతిరేక ఉద్యమం మొదలుకొని నేటి నీట్ వ్యతిరేక పోరాటం వరకు అన్నింట్లో పాల్గొన్నారని పేర్కొన్నారు. 1959లో తేక్కంపట్టి పంచాయతీ సభ్యులుగా, 1964లో కారమడై పంచాయతీ యూనియన్ సభ్యులుగా, తర్వాత తేక్కంపట్టి పంచాయతీ ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారని, 1970 నుంచి 45ఏళ్లు తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతు చర్చా కమిటీ సభ్యులుగా పనిచేశారని గుర్తు చేసుకున్నారు. ఆమె జీవనం, సేవలను ప్రశంసించేలా 2021లో పద్మశ్రీ పురస్కారంతో కేంద్ర ప్రభుత్వం సత్కరించిందని తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు, పార్టీ శ్రేణులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## అన్నాడీఎంకే మాజీ ఎంపీ జైలు శిక్ష కొట్టివేత

**ప్యారిస్, న్యూస్‌టుడే:** అన్నాడీఎంకే మాజీ ఎంపీ, ఇతరులకు విధించిన జైలు శిక్షను మద్రాసు హైకోర్టు కొట్టివేసింది. 2014-2019లో అన్నాడీఎంకే ఎంపీ కే.ఎన్. రామచంద్రన్ కన్నమ్మాళ్ విద్యా ఫౌండేషన్ ట్రస్టీగా కూడా ఉన్నారు. ఆ ఫౌండేషన్ ఆధీనంలోని శక్తి మారియమ్మన్ కళాశాల విస్తరణకు సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో రుణం తీసుకోవడానికి రామచంద్రన్ దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు పరిశీలించడానికి, తాను తన కుటుంబీకులు అమెరికా వెళ్లి వచ్చేందుకు విమాన ఛార్జీలు రూ.2.69 లక్షలు పొందిన మేనేజరు త్యాగరాజన్ రూ.20 కోట్లు రుణం ఇచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ విషయమై బ్యాంకు మేనేజరు త్యాగరాజన్, రామచంద్రన్, ఆయన కుమారుడు రాజశేఖరన్ తదితరులపై 2015లో సీబీఐ కేసు నమోదు చేసింది. విచారణ జరిపిన ప్రత్యేక కోర్టు రామచంద్రన్, రాజశేఖరన్‌లకు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.1.10 కోట్లు జరిమానా, మేనేజరు త్యాగరాజన్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.13 లక్షల జరిమానా విధిస్తూ 2020లో ఉత్తర్వులు ఇచ్చింది. రుణం పొందిన కన్నమ్మాళ్ ఫౌండేషన్‌కు రూ.15.20 కోట్లు జరిమానా విధించింది. ఈ తీర్పును వ్యతిరేకంగా వారంతా దాఖలు చేసిన అప్పీలును మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయచంద్రన్ విచారించారు. తగిన ఆధారాలు లేవని తెలిపి రామచంద్రన్, మిగిలిన వారికి విధించిన జైలుశిక్ష కొట్టివేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వారిలో ఎవరైనా జైల్లో ఉంటే వెంటనే విడుదల చేయాలని, చెల్లించిన జరిమానా తిరిగివ్వాలని శనివారం తీర్పు ఇచ్చారు.

## తుది దశకు పాంబన్ రైల్వే వంతెన పనులు

**ప్యారిస్, న్యూస్‌టుడే:** పాంబన్ రైల్వే వంతెనపై 600 టన్నుల ఇనుప రాడ్లు ఏర్పాటు పనులు వేగంగా జరుగుతున్నాయి. రామనాథపురం జిల్లా మండపం, రామేశ్వరం మధ్య పాంబన్ వద్ద సముద్రంపై రూ.550 కోట్ల వ్యయంతో కొత్త రైల్వే వంతెన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం వంతెన మధ్యలో లిఫ్ట్ ఏర్పాటు పనులు వేగంగా జరుగుతున్నాయి. 650 టన్నుల బరువున్న లిఫ్ట్‌ను హైడ్రాలిక్ యంత్రం సాయంతో 22 మీటర్ల ఎత్తుకి లేపి, మూసేలా ఏర్పాటు చేశారు. ఇందుకు ఇరు వైపులా బరువు సమానంగా ఉండాలి. కావున లిఫ్ట్ పైనున్న రెండు బాక్సుల్లో తలా 300 టన్నుల చొప్పున 600 టన్నుల ఇనుప రాడ్డులను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు రెండు రోజుల్లో పూర్తవుతాయని, తర్వాత లిఫ్ట్ ట్రయల్ రన్ జరుగుతుందని రైల్వే ఇంజినీర్లు తెలిపారు.

## గిండి రైల్వే స్టేషన్‌లో కార్ల పార్కింగు వసతి

### త్వరలో భవంతి నిర్మాణం



ఎంఎల్‌సీపీ నమూనా

**వడపళని, న్యూస్‌టుడే:** దక్షిణ రైల్వే చెన్నై డివిజన్ పునరాభివృద్ధి పనుల్లో భాగంగా గిండి రైల్వే స్టేషనులో 'మల్టీ లెవల్ కార్ పార్కింగ్' (ఎంఎల్‌సీపీ) నిర్మాణం త్వరలో చేపట్టనున్నారు. రోజుకు గిండి స్టేషను నుంచి 65 వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో 150 కార్లను పార్కు చేసుకునేందుకు వీలుగా నిర్మాణం చేపట్టేందుకు దక్షిణ రైల్వే సిద్ధమైంది. పార్కింగు ఛార్జీలు నామమాత్రంగానే ఉంటాయి. ప్రతి నాలుగు గంటలకు రూ.25, నెలవారీ పాస్‌కు రూ.3,750గా నిర్ణయించారు. ఈ ఛార్జీలు రైలు ప్రయాణికులకే కాకుండా ఇతరులకు కూడా వర్తిస్తాయని దక్షిణ రైల్వే పేర్కొంది. ఆటోమేటెడ్ వెహికల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఏవీఎంఎస్) విధానంతో పార్కింగు సదుపాయం అందుబాటులోకి రానుందని, గ్రౌండ్ ఫ్లోర్‌లో అల్పాహార కేంద్రాలు, క్రీడా కేంద్రాలు, చిన్నారులు ఆడుకునేందుకు గేమ్ జోన్లు, రిటైల్ దుకాణాలు వంటివి ఉంటాయని తెలిపింది. 'బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్' (బీవోటీ) పద్ధతిలో ఈ-వేలం ద్వారా 15 ఏళ్లపాటు నిర్వహణకు కాంట్రాక్టు అప్పగిస్తారు. ఆసక్తి ఉన్నవారు 'ఇండియన్ రైల్వేస్ ఈ-ప్రొక్యూర్‌మెంట్ సర్వీసెస్' (ఐఆర్‌ఈపీఎస్) వెబ్‌సైట్‌లో వేలం జరుగుతుంది. కొటేషన్లు ఐఆర్‌ఈపీఎస్ పోర్టల్‌లోగానీ లేదా చెన్నైలోని డివిజనల్ మేనేజరు కార్యాలయం నుంచి వివరాలు తెలుసుకోవచ్చు.

## విద్యార్థుల పరీక్ష ఫీజులు సకాలంలో చెల్లిస్తాం: పుదువై విద్యాశాఖ

**టీనగర్, న్యూస్‌టుడే:** పుదుచ్చేరిలో ప్రస్తుత విద్యా సంవత్సరానికిగాను 10, ప్లస్‌టూ విద్యార్థుల పరీక్ష ఫీజు సకాలంలో చెల్లిస్తామని ఆ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ ప్రియదర్శిని పేర్కొన్నారు. ఆమె శనివారం విలేకర్లతో మాట్లాడుతూ.. పుదుచ్చేరిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఇంతకాలం తమిళనాడు పాఠ్యాంశాల ఆధారంగా పరీక్షలు రాసినట్లు గుర్తు చేశారు. ఇక ఈ విద్యా సంవత్సరం నుంచి ఒకటి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు సీబీఎస్‌ఈ పాఠ్యాంశాలు అభ్యసిస్తారని తెలిపారు. పరీక్ష ఫీజు చెల్లించేందుకు అక్టోబరు 4వ తేదీ వరకు గడువు ఉందని, ఈలోగా ప్రభుత్వం తరఫున ఫీజు చెల్లిస్తామన్నారు. ఇందుకు సంబంధించి నిధులు ప్రభుత్వం 2024-2025 వార్షిక బడ్జెట్లో కేటాయించినట్లు గుర్తు చేశారు. ఫీజులు చెల్లింపులో జాప్యం జరుగుతున్నట్లు వెలువడిన ఆరోపణల నేపథ్యంలో ఆమె ఈ మేరకు వివరణ ఇచ్చారు.

## మొక్కజొన్నను దున్నేస్తున్న రైతులు

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** పెరంబలూర్ జిల్లాలోని పలువురు రైతులు మొక్కజొన్న పంటను దున్నేస్తున్నారు. ఇక్కడి 90 శాతం సాగు వర్షాధారంగానే ఉంటుంది. ఎక్కువ మంది మొక్కజొన్నవైపే మొగ్గు చూపుతుంటారు. ప్రస్తుతం ఆ పంట జిల్లాలో 1.65 లక్షల ఎకరాల్లో సాగైంది. విత్తనాలు నాటిన రెండు నెలలకే రెండడుగుల ఎత్తు పెరిగింది. అనంతరం నెల రోజులకు పైగా వర్షాలు లేకపోవడం, ఎండల తీవ్రత అధికమవడంతో రెండు వారాలుగా ఎండిపోతోంది. మళ్లీ వర్షం కురిసినా ప్రయోజనం లేదని భావిస్తున్న రైతులు ట్రాక్టర్లతో దున్నేస్తున్నారు. ఇప్పటికే ఆరుకు పైగా గ్రామాల్లో 2,500 ఎకరాల విస్తీర్ణంలోని మొక్కజొన్నను భూమిలో కలిపేశారు.



విద్యార్థులు తయారు చేసిన రేస్ కారును పరిశీలిస్తున్న కులపతి విశ్వనాథన్

# వీఐటీలో అంతర్జాతీయ సాంకేతిక ఉత్సవం

**సైదాపేట, న్యూస్‌టుడే:** వేలూర్ వీఐటీ విశ్వవిద్యాలయంలో 'గ్రావిడాస్-24 అంతర్జాతీయ సాంకేతిక ఉత్సవం' శుక్రవారం ప్రారంభమైంది. ఆదివారం వరకు జరగనుంది. కార్యక్రమానికి వీఐటీ కులపతి విశ్వనాథన్ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ కార్యక్రమంలో పలు దేశాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఆటోడెస్క్ ప్రైవేట్ లిమిటెడ్ ఎడ్యుకేషన్ మేనేజర్ మనోరంజన్ రామ్ మాట్లాడుతూ... భారతదేశం ఆర్థికాభివృద్ధిలో మెరుగుపడుతోందని, విద్యార్థులకు సాంకేతిక విద్యలో అవకాశాలు పెరుగుతున్నాయని తెలిపారు. మున్ముందు కృత్రిమ మేధ (ఏఐ) కీలకం కానుందని చెప్పారు. దానిని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ సాంకేతిక ఉత్సవంలో 200కు పైగా ప్రాజెక్టు పోటీలు జరగనున్నట్లు తెలిపారు. వీటిల్లో విజయం సాధించే విద్యార్థులకు రూ.25 లక్షల విలువైన బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వీఐటీ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్, జీవీ సెల్వం తదితరులు పాల్గొన్నారు.



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

## అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన

**తిరుత్తణి, న్యూస్‌టుడే:** అగ్నిప్రమాదాలు సంభవిస్తే మంటలను ఎలా అదుపు చేయాలో వివరిస్తూ అగ్నిమాపక సిబ్బంది అవగాహన కార్యక్రమాన్ని తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించారు. శుక్రవారం స్థానిక అగ్నిమాపక శాఖ అధికారి వీరరాఘవన్ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించారు.

## ఆస్తిపన్ను పెంపు నిర్ణయం సరికాదు

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** చెన్నై మహానగరపాలక సంస్థ ఆస్తిపన్ను 6 శాతం పెంచాలని తీసుకున్న నిర్ణయం ఆమోదయోగ్యం కాదని టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్ ఖండించారు. ఆయన శనివారం విడుదల చేసిన ప్రకటనలో.. 2022లో ఆస్తిపన్ను పెంచారని, ప్రస్తుతం మళ్లీ 6 శాతం పెంచడం నగరవాసులను దిగ్భ్రాంతికి గురిచేస్తుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

### ఉపసంహరించుకోవాలి: టీటీవీ

**సైదాపేట:** ఆస్తిపన్ను పెంపు నిర్ణయం డీఎంకే ప్రభుత్వ అసమర్థతగా ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ విమర్శించారు. శనివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... ఆస్తిపన్ను 6 శాతం పెంచుతూ చెన్నై కార్పొరేషన్‌లో తీర్మానం ఆమోదించడం సరికాదన్నారు. పేద, బడుగు వర్గాలపై భారం పడకుండా ఆదాయాన్ని పెంచేందుకు సృజనాత్మక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముందే డీఎంకే ప్రభుత్వం పెంచిన పన్నులు, ఇతర ఛార్జీలతో సామాన్యులు అవస్థలు పడుతున్నారని, కావున ఆస్తిపన్ను పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## నిరసనకారుల అరెస్టు

**ప్యారిస్, న్యూస్‌టుడే:** డీఎంకే వజ్రోత్సవాల సభాస్థలి వద్దకు ర్యాలీగా వెళ్లడానికి యత్నించిన పరందూర్ విమానాశ్రయ నిరసనకారులను పోలీసులు అరెస్టు చేశారు. కాంచీపురం సమీపం పరందూర్ వద్ద విమానాశ్రయ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ పరిసర గ్రామాల ప్రజలు రెండేళ్లుగా అనేక పోరాటాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డీఎంకే వజ్రోత్సవ వేడుకలకు విచ్చేసిన ముఖ్యమంత్రిని కలిసి తమ గోడు విన్నవించేందుకు నిరసనకారులు పోలీసుల అనుమతి కోరారు. అనుమతి దక్కకపోవడంతో ఏకనాపురంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి సభాస్థలి వద్దకు ర్యాలీగా వెళ్లడానికి యత్నించారు. వారిని పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసనకారులు

## త్వరలో స్వదేశానికి 12 మంది జాలర్లు

### ఎంపీ విజయ్ వసంత్

**ప్యారిస్, న్యూస్‌టుడే:** సముద్రంలో చిక్కుకున్న 12 మంది జాలర్లు త్వరలో స్వదేశానికి వస్తారని ఎంపీ విజయ్ వసంత్ అన్నారు. కన్నియాకుమరికి చెందిన మత్స్యకారులు పలువుర్లు విదేశాల్లో, ఇతర రాష్ట్రాల్లో ఉంటూ చేపల వృత్తి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అరుళప్పన్ అనే జాలరి పడవలో ఈనెల 11న కొచ్చి హార్బర్ నుంచి అరుళప్పన్, పాండిచ్చేరికి చెందిన ఇద్దరు, పశ్చిమబెంగాల్‌కి చెందిన ముగ్గురు మొత్తం 12 మంది సముద్రంపైకి వేటకు వెళ్లారు. 15వ తేదీ చేపలు పడుతుండగా పడవలో సాంకేతిక లోపం తలెత్తి నడి సముద్రంలో ఆగిపోయింది. ఈ నేపథ్యంలో ఎంపీ విజయ్ వసంత్ తన సామాజిక మాధ్యమంలో ఓ పోస్టు చేశారు. అందులో.. జాలర్ల పడవలో సాంకేతిక లోపం ఏర్పడి దారితప్పి ఒమన్ దేశ సరిహద్దులోకి వెళ్లిందని, విషయం తెలిసి విదేశాంగ మంత్రి, ఒమన్ రాయబార కార్యాలయాన్ని సంప్రదించి వారిని క్షేమంగా తీసుకురావాలని కోరినట్లు తెలిపారు. వారిని రక్షించి భారత నావికాదళం, కోస్ట్‌గార్డ్ సాయంతో భారతదేశానికి పంపుతారని, అక్టోబరు 1వ తేదీ 12 మంది జాలర్లు స్వదేశానికి తిరిగొస్తారని పేర్కొన్నారు.



ఆంజనేయస్వామి ఆలయంలో కొబ్బరికాయలు కొడుతున్న హిందూ మున్నని నిర్వాహకులు

## హిందూ మున్నని ప్రాయశ్చిత్త పూజలు

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగం చర్చనీయాంశమైన నేపథ్యంలో పలువురు ప్రాయశ్చిత్త పూజలు చేస్తున్నారు. కరూర్ రైల్వే క్వార్టర్స్‌లోని ఆంజనేయస్వామి ఆలయం ఎదుట శనివారం హిందూ మున్నని నగర కార్యదర్శి కామేశ్వరన్, జిల్లా కోశాధికారి రమేష్, నగర అధ్యక్షుడు గణేశన్ నేతృత్వంలో కొబ్బరికాయలు కొట్టారు. కృష్ణరాయపురం, కుళిత్తలైలోని ఆంజనేయస్వామి ఆలయాల్లోనూ కొబ్బరికాయలు కొట్టారు.

## జీఎస్టీ నమోదుకు వ్యాపారులకు సాయం

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** జీఎస్టీ నమోదుకు వ్యాపారులకు సాయం చేయడానికి, వారు నిజాయతీగా వ్యాపారం చేయడాన్ని నిర్ధారించడానికి నెలలో రెండు, నాలుగో వారంలో రెండు రోజుల చొప్పున అధికారులు నేరుగా వెళ్లి పరిశీలించాలని వాణిజ్య పన్నుల శాఖ సూచించింది. రాష్ట్రంలో ఏటా రూ.20 లక్షల మందికిపైగా వ్యాపారులు జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ప్రస్తుత పరిస్థితి ప్రకారం 11.50 లక్షల మంది నమోదు చేసుకున్నారు. కొందరు అధిక మొత్తంలో వ్యాపారం చేసినా నమోదు చేసుకోలేదు. కావున ప్రతి అధికారి తమ పరిధిలోని ప్రాంతాలకు నేరుగా వెళ్లి జీఎస్టీ నమోదు చేసుకోని వ్యాపారులతో నమోదు చేయించాలి. దీని గురించి వాణిజ్య పన్నుల శాఖాధికారి ఒకరు మాట్లాడుతూ.. కొందరు వ్యాపారులకు జీఎస్టీ ఎలా రిజిస్టరు నమోదు చేసుకోవాలో తెలియడం లేదన్నారు. మరి కొందరు కావాలనే చేసుకోవట్లేదని పేర్కొన్నారు. కొందరు వ్యాపారం చేయడంలేదని చెబుతూ మోసం చేస్తున్నారని, కావున సంబంధిత ప్రాంతాలలో నెలలో రెండు, నాలుగో వారాలలో బుధ, గురువారాలు నేరుగా వారి వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్‌కు సహాయపడాలని సూచించినట్టు వివరించారు.

# తాటి మొక్కల ఉత్పత్తికి 60 కొత్త ఫాంలు



తాటి మొక్కల ఉత్పత్తి కేంద్రం

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** కొబ్బరి ఉత్పత్తిని పెంచడానికి 60 ప్రాంతాలలో తాటి మొక్కల ఉత్పత్తి ఫాంలు ఏర్పాటు చేయడానికి ఉద్యానవనశాఖ చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో కోవై, తిరుప్పూర్, తంజావూరు, దిండిగల్లు, కరూర్, కన్యాకుమారి, కడలూర్ తదితర 17 జిల్లాలలో కొబ్బరి ఉత్పత్తి అధికంగా ఉంది. ఈ జిల్లాలలో చాలా ఏళ్ల క్రితం నాటిని తాటి మొక్కల దిగుబడి తగ్గింది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా వేలాది చెట్లు ధ్వంసమయ్యాయి. దీంతో కొబ్బరి బొండాలు, ఎండు కొబ్బరి కొరత ఏర్పడింది. దీంతో ఈ వృత్తిని నమ్ముకున్న రైతులు, కార్మికులు, వ్యాపారులు ఇబ్బందుల పాలయ్యారు. అందువల్ల కొబ్బరి ఉత్పత్తిని పెంచాలని ఉద్యానవన శాఖ తీర్మానించింది. శాఖకు 23 ప్రాంతాలలో తాటి విత్తనాలు నాటే కేంద్రాలు, 16 ప్రాంతాలలో కొబ్బరి చిప్పల కేంద్రాలున్నాయి. ఇక్కడ గతేడాది 20 లక్షల మొక్కలు ఉత్పత్తి చేసి రైతులకు ఉచితంగా, రాయితీ కింద అందజేశారు. ఈ ఏడాది 10 లక్షల మొక్కలు ఉత్పత్తి చేయాలని లక్ష్యం నిర్ణయించారు. భవిష్యత్తులో ఉత్పత్తి పెంచే దిశగా 60 ప్రాంతాలలో ఉత్పత్తి కేంద్రాల పనులు ప్రారంభించారు. దీని గురించి ఉద్యానవన శాఖ అధికారి ఒకరు మాట్లాడుతూ.. 60 ప్రాంతాలలో రూ.5 కోట్ల విలువైన తాటి మొక్కలను ఉత్పత్తి చేసి రైతులకు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. ఎకరాకు 70 మొక్కల వరకు అందజేస్తామని, ఒక చెట్టు నుంచి ఏడాదికి 100 కాయలకు పైగా దిగుబడి పొందవచ్చని పేర్కొన్నారు. నాలుగేళ్లలో రైతులు లబ్ధి పొందవచ్చని పేర్కొన్నారు.

## రాయితీపై ఉల్లి విక్రయాలు

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** మహారాష్ట్ర, ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద ఉల్లిని తమిళనాడుకు వస్తోంది. ప్రస్తుతం ఆంధ్రా, కర్ణాటకలో కోతలు ప్రారంభమయ్యాయి. దీంతో ఉల్లి తక్కువ స్థాయిలోనే వస్తోంది. మహారాష్ట్ర నుంచి విదేశాలకు ఎగుమతి చేస్తున్న కారణంగా ధర పెరిగింది. కోయంబేడు మార్కెట్‌లో గత నెలలో కిలో పెద్ద ఉల్లి రూ.35కు విక్రయించగా ప్రస్తుతం రూ.70కి చేరింది. బయటి దుకాణాలలో రూ.80 నుంచి రూ.90 వరకు విక్రయిస్తున్నారు. దీంతో సామాన్య ప్రజలు కొనలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ధరల నియంత్రణకు సహకార శాఖ ఆధీనంలో ఉన్న జాతీయ వినియోగదారుల సమాఖ్య (ఎన్‌సీసీఎఫ్) కిలో రూ.35 చొప్పున విక్రయాలు ప్రారంభించింది. జనరద్దీ ప్రదేశాలు, నివాస ప్రాంతాలు, ముఖ్య మెట్రో రైల్వే స్టేషన్లు తదితర ప్రాంతాల్లో సంచార విక్రయ వాహనాల ద్వారా విక్రయిస్తున్నారు.

## ప్రత్యేక ప్రతిభావంతులకు జాబ్‌మేళా

**టీనగర్, న్యూస్‌టుడే:** శ్రీ గీతాభవన్ ట్రస్టు, ఎంఎస్ దాదా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతిభావంతులకు ముక్తి జాబ్ హంట్ పేరిట మేళా నిర్వహించారు. నగరంతోపాటు వేర్వేరు ప్రాంతాలకు చెందిన దివ్యాంగులు పాల్గొన్నారు. ముఖాముఖి నిర్వహించిన వివిధ సంస్థల ప్రతినిధులు అర్హులను ఎంచుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న టాటా కన్సల్టెన్సీ సంస్థ సీనియర్ మేనేజరు సుశీంద్రన్ వారికి నియామకపత్రాలు అందించారు. ముక్తి ట్రస్టీ మీనా దాదా పాల్గొన్నారు.



నియామకపత్రం అందిస్తున్న సుశీంద్రన్

## అభిమానులతో సినిమా చూసిన ధ్రువ్


అభిమానులకు అభివాదం చేస్తున్న ధ్రువ్

**చెన్నై, న్యూస్‌టుడే:** నటుడు విక్రమ్ తనయుడు, నటుడు ధ్రువ్ జన్మదిన వేడుకలను నగరంలోని కృష్ణవేణి థియేటర్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. ఆల్ ఇండియా చియాన్ విక్రమ్ అభిమానుల సంఘం అధ్యక్షుడు, మేనేజర్ సూర్య నారాయణన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ధ్రువ్ పాల్గొని పుట్టినరోజు కేక్ కోసి వేడుకలు చేసుకున్నారు. అభిమానులతో సెల్ఫీలు తీసుకున్నారు. విక్రమ్, ధ్రువ్ కలిసి తొలిసారి నటించిన 'మహాన్' చిత్రాన్ని ప్రత్యేక షోగా ప్రదర్శించగా అభిమానులతో కలిసి ఆయన తిలకించారు.

## గ్రామీణ కథలు ఇష్టం


జల్లికట్టు ఎద్దుతో కార్తి

**చెన్నై, న్యూస్‌టుడే:** గ్రామీణ వాతావరణాన్ని నగర ప్రజలకు తెలియజేసే ఉద్దేశంతో, సంప్రదాయం, క్రీడలు, కళలు, ఆహారంతో కూడిన వేడుకలను నందనంలోని వైఎంసీఏ మైదానంలో 'సెంపోలిల్' బృందం నిర్వహిస్తోంది. శనివారం జరిగిన వేడుకల్లో నటుడు కార్తి ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ... వేసవి సెలవుల్లో ఊరికి వెళ్లడమంటే తనకు ఇష్టమని, ఊరు నుంచి తిరిగి రావడానికి మనసు వచ్చేదికాదని తెలిపారు. అలాంటి కథతో కూడుకోవడంతోనే 'మెయ్యళగన్'లో నటించానని చెప్పారు. జల్లికట్టు చెన్నైలో నిర్వహిస్తే మంచిదన్నారు. నిజమైన జల్లికట్టు మాదిరిగానే, 'మెయ్యళగన్' చిత్రీకరణలో మాత్రమే చూశానని తెలిపారు. జల్లికట్టులో విదేశీ తరహాలో ఎద్దులను గాయపరచరని పేర్కొన్నారు.

## శశికుమార్, సిమ్రన్ జంటగా తొలిచిత్రం


సిమ్రన్, శశికుమార్

**చెన్నై, న్యూస్‌టుడే:** నటుడు శశికుమార్, నటి సిమ్రన్ తొలిసారి జంటగా నటించనున్న చిత్రానికి 'ప్రొడక్షన్ నంబర్ 5'గా పేరు పెట్టారు. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఇటీవల నిర్వహించిన నేపథ్యంలో శశికుమార్ జన్మదినం సందర్భంగా శనివారం అధికారికంగా ప్రకటించారు. చిత్రీకరణ అక్టోబరు తొలివారంలో ప్రారంభించనున్నట్టు, వచ్చే ఏడాది వేసవి సెలవుల్లో విడుదల చేయడానికి నిర్ణయించినట్లు చిత్రబృందం వెల్లడించింది. వర్ధమాన దర్శకుడు అబిషన్ జీవింత్ మెగాఫోన్ పట్టుకుంటున్నారు. మిథున్ జైశంకర్, కమలేశ్, యోగిబాబు, రమేశ్ తిలక్, ఎం.ఎస్.భాస్కర్, బాగవతి పెరుమాళ్ తదితరులు ఇతర నటీనటులు. మిలియన్ డాలర్ స్టూడియోస్, ఎంఆర్‌పీ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మాణ సంస్థల తరఫున నిర్మాతలు పాసిలియన్ నజరేత్, మహేశ్ రాజ్ పాసిలియన్, యువరాజ్ గణేశన్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సీన్ రోల్డన్ సంగీతం సమకూర్చుతున్నారు. పాటలు మోహన్ రాజన్ రాశారు.

## మిస్ మేగీ టీజర్ విడుదల




**చెన్నై, న్యూస్‌టుడే:** తమిళంలో 'మెహంది సర్కస్' ద్వారా పరిచయమైన నటుడు మాదంపట్టి రంగరాజ్. సుదీర్ఘ విరామం తర్వాత 'మిస్ మేగీ'లో నటిస్తున్నారు. యోగిబాబు, ఆత్మిక ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. డ్రమ్‌స్టిక్స్ ప్రొడక్షన్ నిర్మాణంలోని చిత్రానికి లతా ఆర్.మణియరసు దర్శకత్వం వహిస్తున్నారు. కార్తిక్ సంగీతం సమకూర్చుతున్నారు.



## మరికొన్ని సినీ విశేషాలు

◆ హిప్‌హాప్ ఆది నటించిన 'కడైసి ఉలగ పోర్' 20న విడుదలైన నేపథ్యంలో ఈ చిత్రాన్ని ఉత్తరాది రాష్ట్రాల్లో అక్టోబరు 4న విడుదల చేయనున్నారు.

◆ జయం రవి ముంబయిలో తన కార్యాలయాన్ని ఏర్పాటు చేశారని, హిందీలోనూ నటించడానికి ఆ భాషా చిత్రపరిశ్రమ నిర్మాతలతో చర్చలు జరుపుతున్నట్టు సమాచారం.

◆ అధియన్ ఆదిరై దర్శకత్వంలో అట్టకత్తి దినేశ్, కలైయరసన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం 'దండకారణ్యం'. ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది.

## చిట్టి.. ద రోబో డాగ్

**చెన్నై:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రతీ రంగంలోనూ తనదైన ముద్ర వేస్తోంది. ఈ క్రమంలోనే ఏఐ సాంకేతికతతో రూపొందించిన పరికరాలు మార్కెట్‌లోకి వచ్చి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. తాజాగా చెన్నైలోని ఓ పాఠశాలలో ఏర్పాటుచేసిన విజ్ఞాన ప్రదర్శనలో ఓ చిట్టి ఏఐ డాగ్ అందరినీ ఆకట్టుకుంది. చెన్నైలోని బిర్లా ప్లానిటోరియంలో పాఠశాల, కళాశాల విద్యార్థులకు విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు యువకులు 'లెట్స్ మేక్ ఎడ్యుకేషన్ బెటర్' అనే ఓ చిట్టి రోబో డాగ్‌ని ప్రదర్శించారు. ఇది అచ్చం నిజమైన శునకంలానే ప్రవర్తించడంతో అక్కడివారందరూ ఆశ్చర్యపోయారు. ఈ చిట్టి రోబో డాగ్ 25 కేజీల బరువు ఉంటుందని నిర్వాహకులు వెల్లడిస్తున్నారు. ఇది సాధారణ శునకాల మాదిరిగానే షేక్‌హ్యాండ్ ఇవ్వడం, ఎగరడం, కళ్లపై కూర్చోవడంతో పాటు పనులు సైతం చేస్తుంది. అంతేకాదు దీన్ని స్మార్ట్‌ఫోన్ సాయంతో నియంత్రించవచ్చు. ఇందులో 'హెచ్‌డీ కెమెరా అమర్చి ఉండడంతో ఇంటికి భద్రతా పరికరంగా పనిచేస్తుంది. దీని బ్యాటరీ దాదాపు గంటసేపు వస్తుందని దీని తయారీకి నేతృత్వం వహించిన ఆకాశ్ తెలిపారు. ఏఐ సాంకేతికతతో కూడిన వస్తువులు ఎంత వేగంగా అభివృద్ధిచెందుతున్నాయో పిల్లలకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఈ రోబో డాగ్ తయారుచేసినట్లు ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా తమిళ హీరో రజినీకాంత్ రోబో సినిమా ఆధారంగా దీనికి చిట్టి అని పేరు పెట్టినట్లు వెల్లడించారు.

## ఆగస్టులో పెరిగిన విమాన ప్రయాణికులు

**వడపళని, న్యూస్‌టుడే:** రాష్ట్రంలోని చెన్నై, తిరుచ్చి, కోయంబత్తూరు, తూత్తుకుడి విమానాశ్రయాల నుంచి రాకపోకలు సాగించిన ప్రయాణికుల సంఖ్య గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆగస్టులో గణనీయంగా పెరిగింది. మధురైలోనే మిగతా ప్రాంతాల కన్నా తక్కువగా కనిపిస్తోంది. చెన్నైలో దేశీయ ప్రయాణికుల కంటే విదేశీ ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉంది.

### మదురైలో తగ్గుదల

నగరంలోని రెండు టెర్మినళ్ల నుంచి 18,53,115 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. 2023లో 17,53,115 మంది ప్రయాణించిన దానికన్నా 5.1 శాతం ఈ ఏడాది ఎక్కువే. కోయంబత్తూరులో గత ఏడాది ఆగస్టులో 2,53,814 మంది ప్రయాణాలు చేయగా ఈసారి 2,70,013 మంది ప్రయాణించారు. అదేవిధంగా తిరుచ్చిలో గత ఏడాది 1,43,104 మంది ఉండగా ఈ సంవత్సరం 1,68,668 మంది ప్రయాణించారు. తూత్తుకుడిలో 16,526 నుంచి 19,237 మందికి పెరిగింది. మదురైలో చూస్తే గతేడాది ఆగస్టులో 1,14,408 మంది ఉండగా ఈసారి 1,08,944 మంది రాకపోకలు సాగించారు. సేలంలో 10,994 మంది ప్రయాణించారు. గత ఏడాది సేలంలో సేవలందలేదు.

### కస్టమ్స్ తనిఖీలతో విసుగు

గత ఏడాది ఆగస్టులో అంతర్జాతీయ ప్రయాణికులు 4,94,796 మంది ఉండగా ఈ ఏడాది 4,86,177 మంది ప్రయాణించినట్టు రికార్డులు తెలుపుతున్నాయి. విమానాశ్రయంలో కస్టమ్స్ విభాగ సమస్యలు, తనిఖీల పేరుతో జరుగుతున్న జాప్యంతో అంతర్జాతీయ ప్రయాణికుల సంఖ్య తగ్గిందని విమానాశ్రయ అధికారులు పేర్కొన్నారు. పాత బంగారం, చిన్నపాటి వస్తువుల తీసుకొచ్చినా కూడా కస్టమ్స్ అధికారులు జప్తు చేస్తుండటంతో పలువురు బెంగళూరు, కొచ్చి, హైదరాబాదు, తిరువనంతపురం నుంచి వెళ్లడానికి ఇష్టపడుతున్నారని పలు ట్రావెల్ సంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు.

## కీళడి ఎంపికపై ముఖ్యమంత్రి హర్షం

**చెన్నై, న్యూస్‌టుడే:** పర్యాటక దినోత్సవం సందర్భంగా కేంద్ర పర్యాటకశాఖ తరఫున కీళడిని ఉత్తమ వారసత్వ పర్యాటక కేంద్రంగా ఎంపిక చేయడంపై ముఖ్యమంత్రి స్టాలిన్ హర్షం వ్యక్తం చేశారు. తన 'ఎక్స్' పేజీలో... రాష్ట్ర ప్రభుత్వ పురావస్తుశాఖ తరఫున చేపట్టిన కీళడి పురావస్తు పరిశోధనలు వైగై నదీ పరివాహకంలో పట్టణీకరణ ఉన్నట్లు, ఇది గంగా మైదానం నాగరికత కాలానికి చెందినట్లు నిర్ధారించిందన్నారు. క్రీ.పూ. ఆరో శతాబ్దంలోనే విద్య, అక్షరజ్ఞానం కలిగినదిగా తమిళ సమాజం విరాజిల్లిందని శాస్త్రీయంగా నిరూపించామని తెలిపారు. తమిళుల ప్రాచీన, నాగరికత, విద్యాజ్ఞానం, ప్రపంచంలోని పలు ప్రాంతాలతో కలిగిన వాణిజ్య సంబంధాలను లోకానికి చాటేలా శివగంగై జిల్లాలోని కీళడి పురావస్తు తవ్వకాల్లో లభించిన వస్తువులతో రూ.18.43 కోట్ల వ్యయంతో మ్యూజియాన్ని గత ఏడాది మార్చి 5న ప్రారంభించడాన్ని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర పర్యాటకశాఖ తరఫున ఉత్తమ వారసత్వ పర్యాటక కేంద్రంగా కీళడిని ఎంపిక చేయడం తమిళులకే గర్వకారణమని తెలిపారు.

## వైష్ణవాలయాల్లో భక్తుల రద్దీ


తితిదే ఆలయంలో అలంకరణలో శ్రీనివాసుడు


జలకంఠేశ్వరాలయంలో...

**వేలూర్, న్యూస్‌టుడే:** పెరటాసి మాసం రెండో శనివారం సందర్భంగా వేలూర్ జిల్లాలోని వైష్ణవాలయాలకు భక్తులు పోటెత్తారు. వేలూర్ అన్నాసాలైలోని తిరుమల తిరుపతి దేవస్థాన సమాచార కేంద్రంలోని ఆలయానికి తెల్లవారుజామునే భక్తులు భారీగా చేరుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. అదేవిధంగా కోటలోని జలకంఠేశ్వర ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు.

## పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ

**గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే:** గుమ్మిడిపూండి సమీప ఈగువారపాళ్యంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు మధ్యాహ్నం భోజనం అందజేస్తారు. గత 3 నెలలుగా అందజేయడంలేదని, పిల్లలకు టీకాలు వేయడంలేదని, సిబ్బంది విధులకు సక్రమంగా హాజరుకావడంలేదని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రియా పీహెచ్‌సీలో శనివారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. వార్డుల్లోని రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మందుల నిల్వలపై ఆరా తీశారు.


మదురై వేళమ్మాళ్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి - ప్యారిస్, న్యూస్‌టుడే

## పళని ఆలయంలో సిబ్బంది చేతివాటం

### ఉచిత బ్యాటరీ వాహనాలకు నగదు వసూలు



**ప్యారిస్, న్యూస్‌టుడే:** పళని దండాయుధపాణి ఆలయానికి ప్రతిరోజు వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. కొండ కింద నుంచి ఆలయానికి చేరుకోవడానికి భక్తుల సౌకర్యార్థం ఆలయం తరఫున ఉచితంగా బ్యాటరీ వాహనాలు, మినీ బస్సులు నడుపుతున్నారు. అయితే బ్యాటరీ వాహనాల్లో ఎక్కేందుకు సిబ్బంది నగదు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఆలయ అధికారులు మాట్లాడుతూ... గిరివలం మార్గంలో భక్తుల కోసం బ్యాటరీ కార్లు సహా మొత్తం 14 వాహనాలు నడుపుతున్నామని, అందులో ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. ఎవరైనా వాటిల్లో ఎక్కడానికి నగదు వసూలు చేస్తే ఆలయ పరిపాలన కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## నెల్లైయప్పర్ ఆలయానికి 100 కిలోల వెండి విరాళం


వెండి అప్పగిస్తున్న దాత సభాపతి

**తిరునెల్వేలి, న్యూస్‌టుడే:** తిరునెల్వేలి జిల్లాలోని నెల్లయప్పర్ ఆలయానికి వెండి రథం తయారు చేసేందుకు స్థానిక సభాపతి అనే వ్యాపారి 100 కిలోల వెండి అందజేశారు. దేవాదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు సమక్షంలో తయారీదారుకు వెండి అప్పగించారు. ఈ కార్యక్రమం శనివారం చెన్నై దేవాదాయ శాఖ కార్యాలయంలో జరిగింది. రథానికి అవసరమైన వెండి రేకుల తయారు పనులను కూడా ప్రారంభించారు. ఆ శాఖ అధికారులు చంద్రమోహన్, శ్రీధర్, వానతి తదితరులు పాల్గొన్నారు.

## పవర్ స్ప్రేయర్‌తో వరి విత్తనాలు వేసిన రైతు


విత్తనాలు చల్లుతున్న వెంకటేష్

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** ఖర్చులు తగ్గించుకునేందుకు ఓ రైతు 'పవర్ స్ప్రేయర్' ద్వారా నేరుగా వరి విత్తనాలు పొలంలో చల్లుతున్నారు. మేట్టూరు డ్యామ్ నుంచి సక్రమంగా నీరు విడుదల చేస్తే డెల్టా జిల్లాల్లో కురువై, సంబా, తాళడి సీజన్‌లో సుమారు 20 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుంది. సాధారణం నారు పోసుకుని అనంతరం నాట్లు వేస్తుంటారు. కొన్నేళ్లుగా కూలీల కొరతతో పలువురు రైతులు యంత్రాలతో నాట్లు వేస్తున్నారు. భూగర్భజలాలు అందుబాటులో లేని, పరీవాహక ప్రాంతాల వ్యవసాయ యోగ్యమైన పొలాల్లో డ్రమ్ సీడర్‌ను ఉపయోగిస్తున్నారు. ఖర్చులు ఆదా అవుతుండటంతో రైతులు ఈ పద్ధతివైపు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం పొలాల్లో విత్తనాలను 'పవర్ స్ప్రేయర్'తో తంజావూరు జిల్లా పాపానాశం సమీపంలోని గోవిందనల్లూర్‌కు చెందిన రైతు ఎస్.వెంకటేష్ చల్లుతున్నారు. ఆయన మాట్లాడుతూ.. ఈ పద్ధతి ద్వారా విత్తనాలు వేగంగా మట్టిలో చొచ్చుకుపోయి బాగా మొలకెత్తుతాయని చెప్పారు. మూడేళ్లుగా ఇదే విధానం అవలంబిస్తున్నట్లు వివరించారు.

## కోయంబత్తూరులో తనిఖీలు


విద్యార్థుల వసతిగృహం వద్ద పోలీసులు

**కోయంబత్తూరు, న్యూస్‌టుడే:** కోవైలో మత్తుపదార్థాల నియంత్రణకు పోలీసులు పలు చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో పోలీసు కమిషనర్ బాలకృష్ణన్ ఉత్తర్వుల మేరకు శనివారం పీళమేడు, శరవణపట్టి, గునియముత్తూర్, కొవైపుత్తూర్, ఈచ్చనారి తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. కళాశాల విద్యార్థులు బస చేస్తున్న వసతిగృహాల్లో సోదాలు చేపట్టారు. గతనెల నగర శివారులోని కాట్టాంకొళత్తూర్‌లోని ప్రైవేట్ కళాశాలలో తనిఖీ చేపట్టగా గంజాయి దాచిన 30 మందికిపైగా విద్యార్థులను అరెస్టు చేశారు. వారు బెయిల్‌పై బయటికొచ్చారు.


సైకిళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే దురైచంద్రశేఖర్

## విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

**పెరియపాళ్యం, న్యూస్‌టుడే:** పెరియపాళ్యం సమీప ఆరణిలోని ప్రభుత్వ బాలికల మహోన్నత పాఠశాలలో శనివారం రాష్ట్ర ప్రభుత్వం తరఫున విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే దురైచంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థినులకు సైకిళ్లు అందజేశారు. వార్డు కౌన్సిలర్లు కన్నదాసన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రిగా ఉదయనిధి నేడు ప్రమాణస్వీకారం



**చెన్నై, న్యూస్‌టుడే:** రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ ఉప ముఖ్యమంత్రిగా ఆదివారం సాయంత్రం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మంత్రివర్గంలో స్వల్ప మార్పులు చోటుచేసుకోనున్నాయి. వి. సెంథిల్ బాలాజీ, గోవి. చెళియన్, ఆర్. రాజేంద్రన్, ఎస్.ఎం.నాజర్‌ను మంత్రివర్గంలోకి తీసుకోనున్నారు. అలాగే పాడి పరిశ్రమలశాఖ మంత్రి మనోతంగరాజ్, మైనారిటీలు, ప్రవాస తమిళుల సంక్షేమశాఖ మంత్రి సెంజి కె.ఎస్.మస్తాన్, పర్యాటకశాఖ మంత్రి రామచంద్రన్‌లకు మంత్రివర్గం నుంచి ఉద్వాసన కలగనుంది. పొన్ముడి, మెయ్యనాథన్, కయల్‌విళి సెల్వరాజ్, మదివేందన్, రాజకన్నప్పన్, తంగం తెన్నరసు శాఖల్లో మార్పులు చోటుచేసుకోనున్నాయి. దీనికి సంబంధించి ముఖ్యమంత్రి పంపిన ప్రతిపాదనను గవర్నర్ శనివారం ఆమోదించారు.

## పెంపుడు జంతువులకు టీకాలు


శునకానికి టీకా వేస్తున్న వైద్యులు

**వేలూర్, న్యూస్‌టుడే:** ప్రపంచ రాబిస్ దినోత్సవం సందర్భంగా పశుసంవర్ధకశాఖ తరఫున శనివారం వేలూరు వెటర్నరీ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో పెంపుడు జంతువులకు ఉచిత టీకా శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని పశుసంవర్ధకశాఖ వేలూర్ మండల డిప్యూటీ డైరెక్టర్ గోపీకృష్ణ ప్రారంభించారు. ఆస్పత్రి వైద్యుడు పాండియన్, సహాయ డివిజనల్ డైరెక్టర్ అందువన్ పాల్గొన్నారు.

## బస్సు డ్రైవర్‌పై దాడి.. ఆగిన బస్సులు


రోడ్డుపై ఆగిన బస్సులు

**గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సత్యవేడు నుంచి గుమ్మిడిపూండి మీదుగా పొన్నేరికి ఓ ప్రభుత్వ బస్సు శనివారం బయలుదేరింది. మీంజూరుకు చెందిన విజయ్ డ్రైవర్. మాదరపాక్కం వద్ద వెళ్తుండగా బస్సు నిదానంగా వెళ్తోందని ఓ ప్రయాణికుడు డ్రైవర్‌తో గొడవకు దిగాడు. ఇంతలో బస్సు గుమ్మిడిపూండి బస్టాండుకు చేరుకోగా ఆ ప్రయాణికుడు డ్రైవర్‌పై దాడి చేసి పారిపోయాడు. డ్రైవరు అతన్ని వెంబడించాడు. దీంతో వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. డ్రైవర్‌పై దాడికి నిరసనగా ఆ మార్గం గుండా వెళ్లే ఇతర ప్రభుత్వ బస్సుల డ్రైవర్లు వాహనాలను రోడ్డుపైనే ఆపేశారు. దీంతో గుమ్మిడిపూండి బజారు వీధిలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. డ్రైవర్ విజయ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు విస్తరణకు ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

**రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే:** ఆవడి సమీప తిరునిండ్రవూరు నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అలమేలుమంగాపురం వరకు 61 కి.మీ దూరానికి 4 వరుసల రోడ్డు నిర్మించేందుకు రాష్ట్ర రవాణా శాఖ అధికారులు ప్రణాళిక రచించారు. ఇందు కోసం ఆక్రమణల తొలగింపు పనులు చేపట్టారు. తిరువళ్ళూరు సమీప తిరుప్పాచ్చూరు, కొసవన్‌పాళ్యం, సిరువానూరు ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని నిర్మించిన భవనాలను శనివారం తొలగించారు. దీంతో ఆక్రమణదారులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణలు తొలగించారు.

## శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనంలో తరగతులు


తరగతి గదిలో విద్యార్థులు

**తిరుత్తణి:** తిరువళ్లూర్ జిల్లా తిరువాలంగాడు పంచాయతీ యూనియన్ పరిధిలో సుమారు నాలుగేళ్లపాటు మూతపడి ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనంలో శనివారం తరగతులు నిర్వహించారు. భవనం శిథిలావస్థలో ఉందని అధికారులు నాలుగేళ్ల క్రితం భవనానికి సీలు వేశారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గదుల్లో తరగతులు నిర్వహించారు. అదేసమయంలో మూసేసిన భవనాన్ని కూల్చనున్నారని, అక్కడ గ్రామపంచాయతీ కౌన్సిల్ కార్యాలయ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఆరోపణలను ఖండించిన అధికారులు మూసేసిన భవనంలో తరగతులు నిర్వహించడానికి శనివారం అనుమతించారు. ఆ మేరకు తరగతి గదులు తెరచి పాఠాలు బోధించారు. అయితే శిథిలావస్థకు చేరిన భవనంలో తరగతులు నిర్వహించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ముఖ్యమంత్రి స్టాలిన్ శనివారం కాంచీపురంలో పేరరిజ్ఞర్ అన్నా స్మారక మందరింలోని అన్నా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అక్కడున్న సందర్శకుల పుస్తకంలో రాష్ట్ర హక్కులు పొందేందుకు అన్నా, కలైజ్ఞర్ మార్గంలో కష్టపడతానని రాసి సంతకం చేశారు. ఆయనతో పాటు జిల్లా కలెక్టరు కలైసెల్వి మోహన్ ఉన్నారు. -ప్యారిస్, న్యూస్‌టుడే


వెళ్లివిధి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

## నేత్ర వైద్య శిబిరానికి స్పందన

**అరక్కోణం, న్యూస్‌టుడే:** రాణిపేట జిల్లా అరక్కోణం పట్టణం తమిళనాడు హౌసింగ్ బోర్డు కాలనీలోని లయన్స్ క్లబ్, కోవై శంకర నేత్రాలయం సంయుక్తంగా 264వ నేత్ర వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించాయి. లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ హరిదాస్ నేతృత్వంలో ఆయన సతీమణి వెళ్లివిధి 22వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శంకర నేత్రాలయం వైద్య బృందం పాల్గొని పరీక్షలు చేసింది. 100 మందిని శస్త్రచికిత్సలకు ఎంపికచేసి కోవై శంకర వైద్యశాలకు బస్సుల ద్వారా తీసుకెళ్లారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## వివాహిత బలవన్మరణం

**రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే:** తిరువళ్ళూరు సమీప వీరరాఘవపురానికి చెందిన నాగరాజ్, గాయత్రి (24) భార్యాభర్తలు. వీరికి కుమార్తె వాణిశ్రీ ఉంది. గాయత్రి ఫిట్స్‌తో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా నయంకాలేదు. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తితో ఆమె శుక్రవారం రాత్రి క్రిమిసంహారక మందు తాగింది. వెంటనే కుటుంబీకులు తిరువళ్ళూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది.

## భార్యను హత్య చేసిన భర్త అరెస్టు


శశికళ (పాతచిత్రం)

**వేలూర్, న్యూస్‌టుడే:** భార్యను హత్య చేసిన భర్తను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల మేరకు... వేలూర్ కాట్పాడి సమీప కేవీకుప్పానికి చెందిన త్యాగరాజన్, శశికళ (34) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఈ నేపథ్యంలో భార్య ప్రవర్తనపై అనుమానంతో త్యాగరాజన్ తరచూ ఆమెతో గొడవపడేవాడు. శుక్రవారం రాత్రి వీరి మధ్య గొడవ జరిగింది. ఆక్రోశంతో త్యాగరాజన్ భార్యపై కత్తితో దాడిచేసి హతమార్చాడు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## టాటా పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం


పరిశ్రమ నుంచి వెలువడుతున్న మంటలు, పొగ


కుప్పకూలిన పరిశ్రమలోని ఓ విభాగం

**విల్లివాక్కం, న్యూస్‌టుడే:** ప్రముఖ టాటా సంస్థకు చెందిన సెల్‌ఫోన్లకు రంగులు పూసే పరిశ్రమలో శనివారం అగ్నిప్రమాదం సంభవించింది. కృష్ణగిరి జిల్లా హోసూరు సమీప తిమిదేపల్లిలో ఉన్న పరిశ్రమలో తెల్లవారుజామున 5.30 గంటలకు రంగుల విభాగంలో మంటలు చెలరేగాయి. కొద్ది నిమిషాల్లోనే మంటలు ఇతర విభాగాలకు వ్యాపించాయి. సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ సరయు, సబ్‌కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ తంగదురై అగ్నిమాపక దళాన్ని అప్రమత్తం చేసి, ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలు ఎగసిపడుతున్న సమయంలో పరిశ్రమలో మూడు వేల మంది కార్మికులు పనిచేస్తున్నట్లు గుర్తించారు. అందులో ఎక్కువ భాగం యువతులే. అక్కడి యంత్రాంగం వేగంగా కార్మికులందరినీ వెలుపలికి వెళ్లేలా చేయడంతో ప్రాణనష్టం తప్పింది. రసాయనాలు కాలడంతో వెలువడిన వాయువు పీల్చి కొందరు కార్మికులు రహదారిపై స్పృహతప్పి పడిపోయారు. వారిని హోసూరులోని కావేరి ఆసుపత్రికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది సుమారు ఆరు గంటలపాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. భారీగా నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా.

## బాణసంచా పరిశ్రమలో పేలుడు


నేలమట్టమైన భవనం

**ప్యారిస్, న్యూస్‌టుడే:** విరుదునగర్ జిల్లా శివకాశికి చెందిన కందసామి డీఎంకే ప్రముఖుడు. ఇతనికి సాత్తూర్ సమీపం ముత్తాళ్‌నాయక్కన్‌పట్టిలో బాణసంచా పరిశ్రమ ఉంది. అక్కడ 50 మందికి పైగా కార్మికులు పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం కార్మికులు పనిలో ఉండగా అకస్మాత్తుగా పేలుడు సంభవించింది. ప్రమాద ధాటికి భవనం నేలమట్టమైంది. సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మంటలు ఆర్పేందుకు యత్నించారు. బాణసంచా పేలుతూనే ఉండటంతో సహాయకచర్యలకు ఆటంకం ఏర్పడింది. సుమారు 5 గంటల తర్వాత మంటలను అదుపుచేశారు. ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

## వీధిశునకాల దాడిలో 16 మందికి గాయాలు


చికిత్స పొందుతున్న కుప్పమ్మాళ్

**తిరుత్తణి, న్యూస్‌టుడే:** తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి సమీపంలో కేజీ కండిగ వద్ద వీధి కుక్కలు వీరంగం సృష్టిస్తున్నాయి. వాటి దాడిలో రెండు రోజుల్లో 16 మంది గాయపడ్డారు. నొచ్చిలి రోడ్, ఎస్.అగ్రహారం రోడ్ తదితర ప్రాంతాల్లో వీధి కుక్కలు భారీగా సంచరిస్తున్నాయి. ద్విచక్ర వాహన చోదకులు, పాదచారులు, వృద్ధులు, విద్యార్థులపై నిత్యం దాడి చేస్తున్నాయి. స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. శుక్రవారం ఒక్కరోజే 13 మందిని గాయపరిచినట్లు స్థానికులు పేర్కొన్నారు. తీవ్రంగా గాయపడిన లక్ష్మణపురానికి చెందిన సురేష్, కుప్పమ్మాళ్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.